మళ్ళీ
# అమరావతి కథలు
సత్యం శంకరమంచి

ఊళ్ళో ఎక్కడో పెళ్ళి బాజాలు మోగుతున్నాయి.

రెండు రోజుల నుంచి వొంటిపూట గంజి తాగుతూ, నీరసంగా గోడకానుకుని కళ్ళు మూసుకుని పడుకున్న సంగడు ఉలిక్కిపడి లేచాడు.

మళ్ళీ దూరంగా సన్నాయి మోత. రండోల్ మోత. "పెళ్ళే! పెళ్ళి జరుగుతంది!..." సంబరంగా లేచి నుంచున్నాడు. ఎదురుగుండా చూసి, చితికిపోయిన పెళ్ళి పల్లకీ వైపు చూశాడు. దిగాలుగా మోడులా వుంది పెళ్ళి పల్లకీ. నలభై ఏళ్ళయి ఆ పల్లకీని ఎవరూ వాడడం లేదు. పల్లకీకి చుట్టిన పేలికలు మాసిపోయి ఎండకు ఎండి వానకు తడిసి నల్లగా వికృతంగా వున్నాయి. మళ్ళీ దూరంగా పెళ్ళి బాజాలు.

సంగడు పల్లకీ దగ్గరకు వెళ్ళి బొంగు నిమిరి "మాసి పోతేనేం! సాపుచేసి కుచ్చులు కడితే గుర్రంలా ఉండదో" అనుకుంటూ పొంగిపోతున్నాడు.

ఇంతలో అడుక్కోడానికెళ్ళిన, నడ్డి వంగిపోయిన సంగడి పెళ్ళాం సుబ్బి ఖాళీ బొచ్చెతో వచ్చింది. "నీకెప్పుడూ పల్లకీ పిచ్చే" అని దెప్పుతుందని, పల్లకీ విడిచిపెట్టి ముందుకొచ్చి "ఏమే! గంజి దొరకలేదా?" అన్నాడు. ఖాళీ బొచ్చె నేలను పడేసి "లేదురా మావా" అంటూ చతికిలబడింది.

దూరంగా పెళ్ళి సన్నాయి.

"పెళ్ళవుతున్నట్టున్నది. ఎళ్ళొద్దామంటె?" అన్నాడు సంగడు. "ఆళ్ళు భోజనాలయిన తర్వాతగాని ముద్దెయ్యరు గదయ్యా. మనకి సందేలే మింగమెతుకు"

వాళ్ళిద్దరికీ మెతుకు సంగతి సరేసరి రెండు రోజుల నుంచీ ఒంటిపూట గంజే. సంగడు పాతపల్లకీ వైపు ఆశగా చూశాడు. "ఉండనే నే యెళ్ళొస్తా" అంటూ లేని ఓపిక తెచ్చుకుని హుషారుగా వీధిలోకొచ్చాడు.


దూరంగా పెళ్ళి సన్నాయి.

ఆ సన్నాయి మోత వింటూంటే సంగడిలో ఎంత ఉత్తేజమో! పెళ్ళి సంబరంతో ముందుకు నడిచాడు. ఠీవిగా పెళ్ళి పెద్దలా అడుగులు వేశాడు.

తను ఎన్ని పెళ్ళిళ్ళు చూశాడుకాదు! యాభై ఏళ్ళ నుంచి ఆ ఊళ్ళో ఏ పెళ్ళి జరిగినా సంగడింట్లోవున్న పల్లకీలోనే పెళ్ళి ఊరేగింపు. సంగడి పదేళ్ళ వయస్సులో సంగడి తండ్రి, అశ్వంలా చుట్టాలు పల్లకీ మోస్తుండగా తాను పక్కనే వుండేవాడు. పల్లకీకి రంగు రంగుల కుచ్చులు... గలగలలాడే గాజు పూసలు...పల్లకీ కొమ్ముకి పట్టు తురాయి. పారశీకాశ్వంలా వుండేది పెళ్ళి పల్లకీ. నీలగంబారీలా వుండేది పెళ్ళి పల్లకీ. అందులోకి వచ్చి కూర్చునేవారు కొత్త పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు. సంగడు చిన్నవాడవడంచేత నెత్తిన గాస్‌లైట్ పెట్టేవారు. ఆ లైటుతో పెళ్ళికొడుకు పెళ్ళికూతురు దగ్గరనుంచునే వాడు సంగడు. మధుపర్కాలు కట్టుకున్న పెళ్ళికొడుకు పెళ్ళికూతుళ్ళ నుదుట బాసికాలు లైటు వెలుతురులో తళుక్కున మెరవగా, పెళ్ళికూతురికి చిరుచెమట పట్టి కళ్యాణ తిలకం కరిగిపోగా, బుగ్గనున్న చాదుచుక్క పెద్దదవగా ఆ దృశ్యాన్ని కళ్ళు విప్పుకు చూసేవాడు సంగడు.

ఎవరూ చూడకుండా పెళ్ళికొడుకు పెళ్ళికూతురు వెయ్యి గిల్లితే ఆ పిల్ల చిరుకోపంతో వారచూపులు చూస్తే కిసుక్కున నవ్వి "అమ్మదొంగ" అనుకునేవాడు సంగడు. అలా ఎన్ని పెళ్ళిళ్ళు చూశాడో! ఎప్పటికైనా తనూ పెళ్ళిచేసుకుని వాళ్ళలాగే పల్లకీలో వూరేగాలని కలలు కనేవాడు.

సంగడికి వయసొచ్చింది. పల్లకీ ఊరేగింపు సంగతి దేవుడెరుగు కాని, అసలు పిల్లనిచ్చేవాడే దొరకలేదు.




కానీపరక లేనివాడికి, కాయకష్టంతో బతికేవాడికి పిల్లనెవరిస్తారు? కొంతకాలానికి ముసలి పెద్దలు గంతకుతగ్గ బొంతని ఏరుకొచ్చి గుళ్ళోకి తీసుకెళ్ళి తాళి కట్టమన్నారు. నాకు పల్లకీ ఊరేగింపు కావాలన్నాడు సంగడు. ముసలాడెవడో నెత్తిన మొట్టి 'బాజాలు పల్లకీలు కావాలంట్రా! సేతులమ్ముకుని బతకండ్రా!' అంటూ గుడిసెలోకి తోశాడు.

సంగడు కొంత కాలానికి సుబ్బితో అనేవాడు "మనం ఇంత మందిని పల్లకీలో కూకోబెట్టి మోసేవాళ్ళం గదా! మనకా కోరిక తీరలేదే? మనకు పిల్లాజల్లా పుట్టినాక ఆళ్ళ పెళ్ళిళ్ళకు వూరేగుతారులేయె" అని.

సుబ్బి నవ్వుకుని "కానీ! దేవుడెట్లా రాసిండో!" అనేది. దేవుడు వాళ్ళు కోరుకున్నట్టు రాయలేదు. వాళ్ళకి పిల్లాజల్లా పుట్టలేదు. పెళ్ళిళ్ళు జరగలేదు. ఊరేగింపు సంబరాలు తీరలేదు. అంతకంటే అన్యాయం ఏమిటంటే పదేళ్ళబట్టి ఊళ్ళో ఏ పెళ్ళికీ పల్లకీ పిలవడం లేదు. ఊరేగింపుకి పూలపల్లకీలు, చిన్నకార్లు వచ్చాయి.

సంగడి పల్లకీ బూజుపట్టిపోయింది. దాంతో జీవనాధారం పోయింది. అయితేనేం? సంగడికి ఆశ చావలేదు. ఎక్కడ పెళ్ళి జరిగినా "పల్లకీ ఊరేగింపు పెయ్యండయ్యా" అని సంగడెళ్ళి బతిమాలుకోవడం వాళ్ళు వద్దు పొమ్మంటే ఉసూరోమంటూ ఇంటికి రావడం మామూలైంది.

దూరంగా పెళ్ళి సన్నాయితోపాటు తాషా మర్ఫా కూడా మోగుతోంది.

పెళ్ళి పందిట్లో పెళ్ళికూతురు తండ్రితో సంగడు గొప్ప ఆవేశంతో చెప్పాడు: "ఊరేగింపుకి పల్లకీ పెట్టించడయ్యా! మహాజోరుగా వుంటది! కుచ్చుల పల్లకీ! రాజా పల్లకీ! అచ్చొచ్చిన పల్లకీ! అద్దాల పల్లకీ!" పెళ్ళికూతురు తండ్రి మగ పెళ్ళివారిని అడగమన్నాడు. సంగడు విడిదికెళ్ళి చెప్పడం మొదలెట్టాడు. "రాజులెక్కే పల్లకీ అయ్యా! రాణివాసం వెళ్ళే పల్లకీ అయ్యా! పట్టుకుచ్చుల పల్లకీ అయ్యా! పదిమంది మోసే పల్లకీ అయ్యా" పెళ్ళి కొడుకు తండ్రి విసుక్కుని పొమ్మన్నాడు. కడుపులో ఆకలి కవిలిపోతున్నా పెళ్ళికొచ్చిన ప్రతివాళ్ళ దగ్గరకూ వెళ్ళి "ముత్యాల పల్లకీ అయ్యా! ముచ్చటైన పల్లకీ అయ్యా!" అంటూ పందిట్లో అందరికీ చెప్పుకుంటున్నాడు. ఎవరూ వినిపించుకోలేదు. "పల్లకీ! పల్లకీ!" అంటూ పందిట్లో తాటాకులకు, మామిడి తోరణాలకు, గుమ్మాల పసుపులకి, గాలిలో సన్నాయికి చెప్పుకున్నాడు. ఏవీ సమాధానం చెప్పలేదు.

సంగడికి కళ్ళనీళ్ళు కారిపోతున్నాయి. ఆకలి పేగుల నమిలేస్తోంది. "పల్లకీ పల్లకీ" అని గొణుక్కుంటూ దుమ్ములో కాళ్ళీడ్చుకుంటూ ఇంట్లోకొచ్చి కూలబడ్డాడు. ఎదురుగుండా పల్లకీ బొంగు సాంతం కనిపించలేదు. వెళ్ళి చూద్దామంటే ఓపికలేక అలాగే కళ్ళు మూసుకుని కూర్చున్నాడు. సొమ్మసిల్లి పడిపోయిన సంగడికి సుబ్బి గంజినిప్ప అందించింది. కళ్ళు తెరిచి నూతిలోంచి అడుగుతూన్నట్టు "ఎక్కడిదే గంజి" అన్నాడు.

"సొముటమ్మి తానడుక్కొచ్చిన నూకల్లో కాసినప్పించింది" అంది.

"గంజిలో ఉప్పు లేదే!"

"ఉప్పెక్కడిది? గంజి కాయడానికే పుల్లల్లేక ఆ పుచ్చిపోయిన పల్లకీ బొంగు విరిచి మంటబెట్టినా."

సంగడి గుండె ఏడ్చింది. కళ్ళు ఏడ్చాయి. ఎదురుగా విరిగిన పల్లకీ.

చేతిలో ఉప్పులేని గంజి. ●

ముత్యాలవాన